జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 17 | మార్చి | 2026 | పేజీలు : 10



## బాధితులకు న్యాయం చేయడంలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలి: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

- పెండింగ్ కేసుల సత్వర పరిష్కారంపై దృష్టి చేపట్టాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవు




**కొత్తగూడెం, మార్చి 16 ( ప్రజాజ్యోతి) :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు పోలీసు అధికారులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల

మిగతా 2 లో...



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ మండల పరిధిలో గ్రామపంచాయతీల పరిపాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మహిళలకు రిజర్వేషన్ కేటాయించిన పంచాయతీలలో అధికారికంగా మహిళా సర్పంచ్‌లు ఉన్నప్పటికీ, వాస్తవానికి వారి భర్తలే అన్ని వ్యవహారాలు నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2 లో..

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి / పాల్వంచ ప్రజాజ్యోతి

# కుర్చీ ఆమెది... పెత్తనం.. ఆయనది..!

- మహిళా సర్పంచ్‌లు పేరుకేనా?
- పాల్వంచలో 'సర్పంచ్ పతి'ల పెత్తనం
- గ్రామసభల నిర్ణయాల్లో భర్తల ఆధిపత్యమన్న ఆరోపణలు
- పంచాయతీల్లో బినామీ పాలనపై విమర్శలు
- ప్రశ్నార్థకంగా మారిన మహిళా రిజర్వేషన్ లక్ష్యం

## అబ్బో ! ఇసుక అక్రమార్కుల హవా?



- పట్టపగలే ట్రాక్టర్లతో ఇసుక స్వాహా
- "అధికారుల నిర్లక్ష్యమా" "ముడుపుల మహిమే"దీనికి కారణమా?

6 లో...

## నవమికి భద్రాచలం పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

- మంత్రి తుమ్మలతో జిల్లా కలెక్టర్ అంకిత్ భేటీ
- భద్రాద్రి అభివృద్ధిపై కీలక ఆదేశాలు
- సీఎం చేతుల మీదుగా భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- సీతారామ డిస్ట్రిబ్యూటరీ, యాతాల కుంట టన్నెల్ పనులు వేగవంతం
- పాండురంగాపురం–మల్కానగిరి రైల్వే లైన్ భూసేకరణ పూర్తి చేయాలి
- భద్రాద్రి జిల్లాలో ఎయిర్‌పోర్ట్‌కు అనుకూల భూమి గుర్తించాలని ఆదేశం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి , మార్చి 16 ( ప్రజాజ్యోతి ):** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భద్రాద్రి రామాలయ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే లైన్, భూసేకరణ, పర్యాటకాభివృద్ధి

మిగతా 6 లో...



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ మండల పరిధిలో గ్రామపంచాయతీల పరిపాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మహిళలకు రిజర్వేషన్ కేటాయించిన పంచాయతీలలో అధికారికంగా మహిళా సర్పంచ్‌లు ఉన్నప్పటికీ, వాస్తవానికి వారి భర్తలే అన్ని వ్యవహారాలు నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి / పాల్వంచ ప్రజాజ్యోతి

# కుర్చీ ఆమెది... పెత్తనం.. ఆయనది..!

- మహిళా సర్పంచ్‌లు పేరుకేనా? ● పాల్వంచలో 'సర్పంచ్ పతి'ల పెత్తనం ● గ్రామసభల నిర్ణయాల్లో భర్తల ఆధిపత్యమన్న ఆరోపణలు
- పంచాయతీల్లో బినామీ పాలనపై విమర్శలు ● ప్రశ్నార్థకంగా మారిన మహిళా రిజర్వేషన్ లక్ష్యం

మండలంలోని 36 గ్రామపంచాయతీలలో కొన్నిచోట్ల "బినామీ సర్పంచ్ వ్యవస్థ" కొనసాగుతోందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ పనులు, అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సర్పంచ్‌ను కలవాలంటే ముందుగా వారి భర్తలను సంప్రదించాల్సి వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామసభలలో అధికారికంగా మహిళా సర్పంచ్‌లు పాల్గొన్నప్పటికీ, నిర్ణయాలు మాత్రం వారి భర్తలే తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. "నేనే రాజు... నేనే మంత్రి" అన్నట్టుగా వ్యవహరిస్తూ గ్రామ పరిపాలనను ప్రభావితం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### ››› పరిపాలనకు నోచుకోని మహిళా సర్పంచ్‌లు

మహిళలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామపంచాయతీలలో రిజర్వేషన్ అమలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం మహిళా సర్పంచ్‌లు పరిపాలనలో పూర్తిగా పాల్గొనలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

వారి స్థానంలో కుటుంబ సభ్యులు, ముఖ్యంగా భర్తలు అధికారాన్ని వినియోగించడం వల్ల మహిళా సాధికారత లక్ష్యం దెబ్బతింటోందని సామాజిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

### ››› ప్రభుత్వ ఉద్యోగి జోక్యంపై ఆరోపణలు

పాల్వంచ మండలంలోని ఒక గ్రామ పంచాయతీలో సర్పంచ్ భర్త ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ గ్రామ రాజకీయాల్లో చురుకుగా జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలకు దూరంగా ఉండాలనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామసభలలో పాల్గొని అధికారిక నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

### ››› కార్యదర్శిపై ఒత్తిడి... బదిలీ చేసుకున్న ఘటన

అదే పంచాయతీలో విధులు నిర్వహించిన మహిళా పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ భర్త ఒత్తిడి తీసుకొచ్చినట్టు స్థానిక వర్గాలు చెబుతున్నాయి. పాలకవర్గం, గ్రామస్థుల సమక్షంలో ఆమెకు తీవ్ర అసౌకర్య పరిస్థితులు ఏర్పడినట్లు సమాచారం. ఈ పరిణామాల వల్ల ఆమె చివరకు బదిలీ తీసుకుని వెళ్లిపోయారనే విషయం గ్రామస్థుల మధ్య చర్చనీయాంశంగా మారింది. అలాగే ఎన్నికల సమయంలో ప్రతిపక్షం తరపున గెలిచిన ఒక వార్డు సభ్యుడు కూడా కొంతకాలానికే రాజీనామా చేయాల్సి వచ్చిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ››› అభివృద్ధి పనులపై అనుమానాలు

గ్రామాల్లో అభివృద్ధి పనులు సక్రమంగా జరగకపోయినా బిల్లులు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని పనులు జరగకపోయినా పూర్తయినట్లు చూపిస్తూ బిల్లులు పొందుతున్నారనే విమర్శలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

### ››› ఫేక్ ఫోటోలు, జీపీఎస్ వివరాలపై ఆరోపణలు

గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులను పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా పై అధికారులకు ఫోటోలతో సహా అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే కొన్ని సందర్భాల్లో పని జరగకపోయినా ఇంటర్నెట్ నుంచి ఫోటోలు డౌన్‌లోడ్ చేసి పనులు పూర్తయినట్లు చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీపీఎస్ లొకేషన్ కెమెరాతో తీసిన ఫోటోలలో పని జరిగిన ప్రదేశం వివరాలు నమోదు కావాల్సి ఉండగా, కొన్ని ఫోటోలలో మాత్రం పాల్వంచ ఎంపీడీఓ కార్యాలయం లొకేషన్ కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఈ వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› బిల్లుల చెల్లింపులపై ప్రశ్నలు

పంచాయతీ పనులకు సంబంధించిన నగదు చెల్లింపులు నిబంధనల ప్రకారం జరగాల్సి ఉండగా, కొన్ని చోట్ల సర్పంచ్ కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లతో నగదు డ్రా అవుతున్నట్లు గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్పంచ్‌కు సన్నిహితులైన వ్యక్తుల పేర్లతో నగదు విత్‌డ్రా అవుతున్నట్లు ఆరోపణలు రావడంతో పంచాయతీ ఆర్థిక లావాదేవీలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› పాత ఫోటోలతో కొత్త పనుల మాయాజాలం?

కొత్త పాలకవర్గం ఏర్పడిన తర్వాత గ్రామంలో పారిశుద్య పనులు పెద్దగా జరగకపోయినా, గతంలో తీసిన ఫోటోలను మళ్లీ అప్లోడ్ చేసి పనులు పూర్తయ్యాయని చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రజా ధనం దుర్వినియోగం జరుగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› విచారణకు డిమాండ్

ఈ పరిస్థితుల నేపథ్యంలో గ్రామపంచాయతీలలో జరుగుతున్న వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రభుత్వ ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు. గ్రామపంచాయతీలలో నిజమైన ప్రజాస్వామ్య పరిపాలన అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాధితులకు న్యాయం చేయడంలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలి: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

(మొదటి పేజీ తరువాయి...)



వివరాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. క్రికెట్ బెట్టింగ్, ప్రభుత్వ నిషేధిత గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సమగ్ర విచారణ నిర్వహించి న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కాల్ట్స్ వాహనాలు నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని డయల్ 100 కు కాల్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. భద్రాచలంలో జరగబోయే శ్రీరామనవమి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అప్రమత్తత కల్పించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము, సైబర్ క్రైమ్స్ డీఎస్పీ అశోక్, ఏవో మంజ్యా నాయక్, సీఐలు, ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన గ్రామంలో రియల్ ఎస్టేట్ జోరు

- గ్రామ పంచాయతీ అనుమతుల్లేకుండానే రియల్ దందా...?
- ఇంటి నెంబర్ నేనే ఇస్తా... ప్లాట్లు కొనండంటు రియల్టార్ జి.వి.ఆర్ హామీ
- ఎటువంటి అనుమతులు లేకుండా 22 ప్లాట్లు అమ్మేసాడంట..!
- అధికారులు పీ...ఏది ఏమిలేదట అంత రియల్టార్లే చూసుకుంటారంట






**కొత్తగూడెం, మార్చి 16 ( ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి మండలం సాటివారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకోకుండానే ప్లాట్లు విక్రయిస్తూ జి.వి.ఆర్ ఉండగా గ్రామ పంచాయతీ అనుమతులెందుకు అంటూ ఒక రియాల్టర్ బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సాటివారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొన్ని భూములను ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్న జి.వి.ఆర్ అనే వ్యక్తి, పంచాయతీ అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్లాట్లు కొనుగోలు చేయాలనుకునే వారికి ఇంటి నెంబర్ కావాలంటే నేనే ఇప్పిస్తాను... పంచాయతీ కార్యదర్శి అనుమతితో పనేముంది అంటూ చెబుతున్నట్లు సమాచారం లేకపోలేదు. ఇప్పటికే 22 ప్లాట్లు అమ్మేశానని, ఇంకా కొన్నే ప్లాట్లు మిగిలి ఉన్నాయని త్వరపడండి అంటూ బహిరంగంగా ప్రచారం చేస్తున్నట్లు ప్లాట్ల కొనుగోలుదారులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా తన మొబైల్ నెంబర్ ను కూడా బహిరంగంగా ప్రకటిస్తూ ప్లాట్ల విక్రయాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. జి.వి.ఆర్ అనే రియల్టార్ జిల్లా అధికారులు, మండల అధికారులు, నియోజకవర్గ నాయకులు తనకు అనుకూలంగా ఉన్నారనే ధీమాతో గిరిజన గ్రామ పంచాయతీకి దక్కాల్సిన గౌరవాన్ని పక్కనపెట్టి వ్యవహరిస్తున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ అనుమతులు లేకుండా ప్లాట్లు విక్రయించడం వల్ల గ్రామ పంచాయతీకి రావాల్సిన ఆదాయం కూడా దెబ్బ తింటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఈ రియల్ ఎస్టేట్ దందాపై సంబంధిత అధికారులు స్పందించి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**సరైన అనుమతులు లేని ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దు**

సాగు భూమి ప్లాట్లుగా విభజించి అమ్మకాలు జరిపేందుకు సరైన అనుమతులు ఉన్నాయో లేదో చూసుకునే పరిస్థితి లేకపోవడం వలనే అమాయక ప్రజలు మోసపోతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి.సాటివారిగూడెం లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాలకు పాల్పడి ప్లాట్లుగా అమ్మకాలు జరుపుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కొంతమంది రియాల్టర్లు అమాయక ప్రజలను మోసం చేసి సొమ్ము చేసుకునేందుకు అనేక ప్రయత్నాలు జరుపుతున్న ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. సరేనా అనుమతులు లేని ఫ్లాట్లు కొనుగోలు చేయొద్దని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు.

**మండల అధికారులు జి.వి.ఆర్ గుప్పెట్లో ఉన్నారనే ధీమా..?**

మండల స్థాయి అధికారులు తన గుప్పెట్లో ఉన్నారనే ధీమాతోనే రియల్ దందాదారుడు జి.వి.ఆర్ ఈ విధంగా బహిరంగంగా ప్లాట్ల విక్రయాలు కొనసాగిస్తున్నాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ అనుమతులు లేకుండానే భూములను ప్లాట్లుగా విభజించి విక్రయించడం వెనుక అధికారుల నిర్లక్ష్యం ఉందా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. రియల్ దందాదారులకు గిరిజన గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ అధికారుల అనుమతులు తీసుకో కుండా ప్లాట్లు విక్రయించేంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

**గ్రామ పంచాయతీ అధికారులను చులకన చేస్తున్నారా..?**

గ్రామ పంచాయతీ అనుమతులు అవసరం లేదని బహిరంగంగా వ్యాఖ్యానించడం పంచాయతీ అధికారులను చులకన చేస్తున్నట్లుగా ఉందని స్థానికులు మండిపడుతున్నారు. గ్రామ పంచాయతీ వ్యవస్థను పట్టించుకోకుండా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సక్రమంగా నెలకొన్న వెంచర్ల కు పంచాయతీ అనుమతులు లేకుండా ప్లాట్ల విక్రయాలు జరిగితే గ్రామ పంచాయతీకి రావాల్సిన పన్నులు, అభివృద్ధి నిధులు దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ వ్యవహారం కొనసాగితే పంచాయతీకి భారీ ఆదాయ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జి.వి.ఆర్ అనే రియల్టార్ బహిరంగంగానే ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నప్పటికీ ఇప్పటివరకు సంబంధిత అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై వెంటనే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## పరీక్ష రాసే విద్యార్థులు భయం వీడాలి



**ఇల్లందు, మార్చి 16, ప్రజాజ్యోతి:** పదవ తరగతి హిందీ పరీక్షను ఈనెల 18న రాసే విద్యార్థులు భయం వీడాలని హిందీ సేవా భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి రాంబాబు సూచించారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష హాలులోకి ప్రవేశించిన తర్వాత ప్రశ్నపత్రాన్ని ఒకటికి రెండుసార్లు చదువుకొని అర్థం చేసుకోవాలన్నారు. పరీక్ష సమయం 3 గంటలు ఉంటుందని, పార్ట్ ఎ క్వశ్చన్ పేపర్ 2.30 గంటలు, పార్ట్ బి బిట్ పేపర్ 30 నిమిషాలు ఉంటుందని తెలిపారు. సెక్షన్ 1 ఆ లో 1గద్యంశాన్ని చదివి స్పష్టంగా అర్థం చేసుకొని 1 నుండి 5 ప్రశ్నలకు రాస్తే విద్యార్థులకు ఐదు మార్కులు వస్తాయని పేర్కొన్నారు. రెండవ ఆ లో గద్యంశాన్ని చదివి అర్థం చేసుకొని 6 నుండి 10 వరకు రాస్తే విద్యార్థులకు 10 మార్కులు వస్తాయని, ఆ తరువాత ఇ లో పద్యంశాన్ని చదివి అర్థం చేసుకొని 11 నుంచి 15 వరకు రాస్తే ఐదు మార్కులు, సెక్షన్ 2లో మొదటి ఆ లో 16 నుంచి 19 వరకు 4 ప్రశ్నలు ఇస్తారని, అందులో ఈ నాలుగు ప్రశ్నలకు కూడా 3, 4 లైన్లలో సమాధానం రాస్తే ఒక్కొక్క ప్రశ్నకు 4 మార్కులు చొప్పున 16 మార్కులు వస్తాయని, విద్యార్థులు ఈ నాలుగు ప్రశ్నలు తప్పనిసరిగా రాయాల్సి ఉంటుందని సూచించారు. రెండవ ఆ లో 20 నుంచి 22 వరకు 3 ప్రశ్నలు ఉంటాయని, ఈ 3 ప్రశ్నలకు అదనంగా ఇందులోనే ఇంకో 3 ప్రశ్నలు ఇవ్వడం జరుగుతుందని, అది ఎలా అంటే ఉదాహరణకు 20 ప్రశ్నలకు 20వ ప్రశ్న అర్థం కాకపోతే దాని కింద ఇంకో అదనంగా ప్రశ్న ఇస్తారని, ఇలా ఒక్కొక్క దానికి కింద ఒక్కొక్క ప్రశ్న ఇస్తారని, ఈ 3 ప్రశ్నలు 8 నుంచి 10 లైన్లు రాస్తే విద్యార్థులకు ఒక్కొక్క ప్రశ్నకు 8 మార్కులు చొప్పున 24 మార్కులు వస్తాయని తెలిపారు. పేపర్ ని చక్కగా చదువుకొని అర్థం చేసుకొని రాస్తే 60 మార్కులు క్వ్యాస్షన్ పేపర్ లో వస్తాయని, ఆ తర్వాత 20 మార్కులకు బిట్ పేపర్ ఉంటుందని, ఈ బిట్ పేపరుకు 30 నిమిషాలు ఉంటుందని, బిట్ పేపర్ ఒకటికి రెండుసార్లు చదువుకొని అర్థం చేసుకొని బిట్లు రాసినట్లయితే 20 మార్కులు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పార్ట్ ఎలో 60 మార్కులు పార్ట్ బిలో 20 మార్కులతో మొత్తం 80 మార్కులు సాధించవచ్చన్నారు. విద్యార్థులు భయపడకుండా ఇచ్చిన ప్రశ్నపత్రాన్ని చక్కగా చదువుకొని అర్థం చేసుకుని సెక్షన్ల వారీగా రాస్తే చక్కటి మార్కులు పొందే అవకాశం ఉంటుందని, విద్యార్థులు పరీక్ష రాయడానికి ఇచ్చిన బుక్లెట్ ను పేజీల వారీగా 4 పలకలు చక్కగా బార్డర్ కొట్టుకొని ఎడమవైపు మనం రాసే సెక్షన్, ఆ క్వ్యాస్షన్ నెంబర్ వేస్తే పేపర్ వాల్యుయేషన్ అప్పుడు వాల్యువేషన్ లో మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళన చెందకుండా ఈ విధంగా పరీక్ష రాస్తే హిందీలో 10/10 జిపిఏ సంపాదించవచ్చని సూచించారు.

## సమ్మెను జయప్రదం చెయ్యండి

- వాల్ పోస్టర్ ను విడుదల చేసిన గుర్తింపు సంఘం



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 16 – ప్రజాజ్యోతి:** సింగరేణి లో కార్మికుల సమస్యలను పరిష్కరించడం లో యాజమాన్యం వైఫల్యం చెందినందున గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. సోమవారం పివికె 5 గనిలో లో జరిగిన వాల్ పోస్టర్ ను గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు విడుదల చేశారు.సింగరేణి యాజమాన్యం కొన్ని సమస్యలను స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో అంగీకరించి ఇంత వరకు వాటిపై అమలు కోసం యాజమాన్యం సర్క్యులర్ లు జారీ చేయలేదని ఎఐటియుసి నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా మారుపేర్లు విజిలెన్స్ కేసుల సమస్య, సొంత ఇంటి పథకం, పెర్క్స్ పై ఇన్ కం టాక్స్ సమస్య, డిస్మిస్ కార్మికుల కు ఒక అవకాశం కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందని కనుక భవిష్యత్తు కార్యాచరణ వాల్ పోస్టర్ ను విడుదల చేశారు, ఏఐటియుసి ఈ నెల 17 నుండి 30 వరకు సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరియు ఏప్రిల్ లో జరగబోయే సమ్మె విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు, కావున జరగబోయే ఆందోళన కార్యక్రమంలో పివికె5 గని కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని సింగరేణి మనుగడను కాపాడాలని ఎఐటియుసి నాయకులు కోరారు, పిట్ కార్యదర్శి భూక్యా రమేష్,పిట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ నాగేశ్వరావు,అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి సందీప్, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ సాయి పవన్, రాంచందర్,సురేందర్ రెడ్డి, సంజీవ్, విక్రమ్, సుమన్, సంతానం, రామారావు, విజయ్,శ్రీను, శశి, భద్రయ్య, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల తెగువే పొట్టి శ్రీరాములు

- మహాత్మా గాంధీ స్ఫూర్తితో ఉద్యమించిన నాయకుడు
- ప్రజల కోసం ప్రాణాన్ని పణంగా పెట్టిన మహనీయుడు... జూపల్లి రమేష్.. మున్సిపాలిటీ వైస్ చైర్మన్





**అశ్వారావుపేట, మార్చి 16, ప్రజాజ్యోతి :** మహాత్మా గాంధీ స్ఫూర్తితో ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని అనేకసార్లు జైలు శిక్ష అనుభవించిన ఉద్యమ నేత, తెలుగు ప్రజల కోసం ప్రాణాన్ని పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు పొట్టి శ్రీరాములని అశ్వారావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ అన్నారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా వాసవి క్లబ్, ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలు పోయినా పర్వాలేదని పట్టుదలతో ప్రజల కోసం తాను సాధించాలనుకున్న రాష్ట్రాన్ని ప్రాణాలను పణంగా పెట్టి సాధించిన మహాశక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. ఒక ఉద్యమం సఫలం కావడం ఎంతో కష్టమని, తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్నా ఉద్యమానికి ముందుండి నడిపించిన నాయకుడు పుట్టి శ్రీరాములని తెలుగు ప్రజల తెగువను ఆయన చూపించారన్నారని, ఆ తెగువే ప్రత్యేక రాష్ట్రాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు శీమకుర్తి శ్రీనివాసరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు సమయమంతుల మోహన్ గంగాధర్ రావు, కార్యదర్శి ఉప్పల పవన్ కుమార్, కోశాధికారి రవి క్రింది కుమార్ రాజా, ఆర్యవైశ్య ప్రముఖులు సంక ప్రసాద్, కొనిజర్ల ఉమామహేశ్వరరావు, దుబకుంట్ల దుర్గారావు , ముత్తా సుమాకర్, శీమకుర్తి వెంకటేశ్వరరావు, తోకల హరీష్‌గుప్త, కంచర్ల భాస్కరరావు, కుంచం సుబ్బారావు, తాతా శ్రీనివాసరావు, జల్లిపల్లి లోక్ నాథ్ గుప్త, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాడేపల్లి రవి, కాసాని పద్మ శేఖర్, కానూరు మోహన్ రావు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎన్నికలు





**ఇల్లందు టౌన్, ప్రజాజ్యోతి:** 2026–27 సంవత్సరానికి గాను ఇల్లెందు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 26న జరగనున్నట్లు సహాయ ఎన్నికల అధికారి దంతాల ఆనంద్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ఇల్లందు బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అధ్యక్ష పోటీ కి కీర్తి కార్తీక్, భూక్య రవికుమార్ నాయక్ లు పోటీ పడుతున్నట్లు తెలిపారు. మిగతా కార్యవర్గ పదవులు ఏకగ్రీవం అయ్యాయని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్లో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్క అడ్వకేట్ ఈనెల 26న జరగనున్న ఇల్లందు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

# హోర్డింగుల దందా ఎవరి ఆశీస్సులతో...?

- ప్రభుత్వ జీవోను తుంగలో తొక్కుతున్న అధికారులు
- కొత్తగూడెం కార్పొరేషన్‌లో అక్రమ హోర్డింగుల దందా..?
- అనుమతులు ఇవ్వొద్దు... వెంటనే తొలగించాలి
- కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన ఇమంది ఉదయ్ కుమార్



**కొత్తగూడెం, మార్చి 16 ( ప్రజాజ్యోతి ):** కొత్తగూడెం, పాల్వంచ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ నిబంధనలను పక్కన పెట్టి రోడ్ల పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన ప్రకటన హోర్డింగులను వెంటనే తొలగించాలని కోరుతూ కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి ఇమంది ఉదయ్ కుమార్ జిల్లా కలెక్టర్ అంకిత్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన ఆయన అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన భారీ ప్రకటన బోర్డులు ప్రజలకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా ప్రమాదాలకు దారి తీసే అవకాశముందని తెలిపారు. ముఖ్యంగా రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన హోర్డింగులు వాహనదారులకు అడ్డంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రమంగా ఏర్పాటు చేసిన అన్ని ప్రకటన బోర్డులను వెంటనే తొలగించాలని కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఇమంది ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ప్రకటన బోర్డులపై ఇప్పటికే 2020 జూలై 4న తెలంగాణ మున్సిపల్ శాఖ స్పష్టమైన జీవో జారీ చేసిందని గుర్తు చేశారు. ఆ జీవో ప్రకారం కొత్తగా ప్రకటన బోర్డులకు అనుమతులు ఇవ్వకూడదని ఇప్పటికే ఉన్న బోర్డులకు కూడా అనుమతులు పొడిగించరాదని పేర్కొన్నారు. అయితే మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పాల్వంచలో దాదాపు మూడేళ్లుగా అక్రమంగా బోర్డులకు అనుమతులు ఇస్తూ వచ్చారని ఆయన ఆరోపించారు. అదే విధంగా కొత్తగూడెంలో కూడా ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే బోర్డులు ఏర్పాటు చేసుకునే పరిస్థితి నెలకొనిందని విమర్శించారు. ఈ విషయంపై రెండు వారాల క్రితమే కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మరోసారి ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న అక్రమ హోర్డింగులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్త హోర్డింగులకు అనుమతులు ఇవ్వకూడదని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 16,ప్రజా జ్యోతి:**
ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖాధికారి రవీంద్రనాథ్ లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించారు.జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా, వాటిని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసి తక్షణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కారం అవుతాయనే ప్రజావాణికి వచ్చిన ప్రజల నమ్మకాలను వమ్ము చేయకుండా అధికారులు తక్షణమే వాటిని పరిష్కరించే విధంగా చూడాలని



అధికారులను ఆదేశించారు.

**ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దబజార్ ప్రాంతంలో నివాసం ఉంటున్న సాంబ పూర్ణచంద్రరావు (తండ్రి: వెంకటేశ్వర్లు) తమకు కొత్తగూడెం పట్టణ పరిధిలోని గాజుల రాజా బస్తీ, విశ్వనాథ కాలనీ, హౌస్ నం.169/A వద్ద 0.22 కుంటల పట్టా భూమి ఉందని తెలిపారు. ఆ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి గృహ నిర్మాణం చేపడుతున్నారని, కావున తగిన చర్యలు తీసుకొని తమ భూమిని తిరిగి తమకు అప్పగించాలంటూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని సాయినగర్ కాలనీకి చెందిన ప్రజలు తమ కాలనీ సుమారు 35 సంవత్సరాల క్రితం ఏర్పడినప్పటి నుండి సీసీ రోడ్డు నిర్మాణం కోసం అనేకసార్లు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం జరగలేదని తెలిపారు. 2019లో రూ.20 లక్షలు మంజూరైనట్లు చెప్పినప్పటికీ డ్రైనేజీ , రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని పేర్కొంటూ వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని చేసిన దరఖాస్తును తగు చర్యల నిమిత్తం లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు.టేకులపల్లి మండలం రాజాపురం గ్రామానికి చెందిన అశోక్ తమ గ్రామంలో సుమారు 10 సంవత్సరాల క్రితం మిషన్ భగీరథ ట్యాంక్ ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు సక్రమంగా నీటి సరఫరా జరగలేదని తెలిపారు. గ్రామంలో ఉన్న రెండు బోర్లు కూడా ప్రస్తుతం పనిచేయడం లేదని పేర్కొంటూ వేసవి కాలంలో త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరించడంతో పాటు బోర్లను మరమ్మతు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం మిషన్ భగీరథ అధికారులకు ఎండార్స్ చేశారు.మణుగూరు మండలం విట్టల్‌రావు నగర్‌కు చెందిన రావుల రాములు (తండ్రి: లేటు నారాయణ) తమకు తిర్లాపురం గ్రామం సర్వే నం.16/23/Aలో ఐదు ఎకరాల భూమి ఉందని తెలిపారు. తమ తండ్రి మరణానంతరం కుటుంబ సభ్యులు ఆ భూమిని తమ పేర్లతో సర్వే చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటూ వివాదంలో ఉన్న భూమిపై సర్వే ప్రక్రియతో పాటు భూమి పరిహారం చెల్లింపులు తాత్కాలికంగా నిలిపివేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం భూసేకరణ అధికారులకు ఎండార్స్ చేశారు.ములకలపల్లి మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న ఉకంటి రవికుమార్ (తండ్రి: వెంకట్రావు) గత రెండు సంవత్సరాలుగా గ్రామపంచాయతీలో పాలకవర్గాలు లేని సమయంలో నిర్వహించిన ఖర్చులు , అప్పుల వివరాలను గ్రామపంచాయతీ నోటీస్ బోర్డులో ప్రజలకు తెలియజేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా పంచాయతీ అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి అరెస్టులపై ఆగ్రహం

- అంగన్వాడీ కార్యకర్తల అరెస్టులను నిరసిస్తూ రాస్తారోకో
- అరెస్టు చేసిన అంగన్వాడీ కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్



**సుజాతనగర్, మార్చి 16 ( ప్రజాజ్యోతి ):** అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను అక్రమంగా అరెస్టు చేశారంటూ సుజాతనగర్ మండలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వీర్ల రమేష్‌పాల్గొని ప్రభుత్వ వైఖరిని విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌కు వెళ్లే ప్రయత్నం చేస్తున్న సమయంలో పోలీసులు వారిని అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. అర్ధరాత్రి సమయంలో ఇళ్లకు వెళ్లి మహిళలను అరెస్టు చేయడం తగదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఎన్నికల సమయంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస వేతనాల సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన అంగన్వాడీ కార్యకర్తలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు నాగమణి, శశికళ, లలిత, మాధవి, రుక్మిణి, అనిత పాల్గొన్నారు. అలాగే ఆశా వర్కర్లు తోళ్ల జయమ్మ, వసంత, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి కాట్రాల తిరుపతిరావు, రైతు సంఘం మండల కార్యదర్శి నల్లగొపు పుల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గండమాల భాస్కర్, సీఐటీయూ మండల నాయకులు చింతల శ్రీనివాసరావు తదితరులు సంఘీభావం తెలిపారు.

# తొట్టిపుంపులో క్షయ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం

- 52 మందికి ఛాతీ పరీక్షలు – ముగ్గురికి ప్రాథమిక అనుమానం

**అన్నపురెడ్డిపల్లి, మార్చి 16, ప్రజా జ్యోతి:** భారతదేశాన్ని క్షయ రహిత దేశంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపుంపు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సున్నం సంఘవి మరియు ఉపసర్పంచ్ కణితి ఆదినారాయణ ప్రారంభించారు.ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో శిబిరం కొనసాగింది. ఆధునిక ఎక్స్‌రే యంత్రంతో గ్రామంలోని 52 మందికి ఛాతీ పరీక్షలు నిర్వహించగా, అందులో ముగ్గురిని ప్రాథమికంగా క్షయ వ్యాధి అనుమానితులుగా గుర్తించినట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ రెండు వారాలకు పైగా తగ్గని దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనుమానితులకు కఫం మరియు రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం తరపున ఉచితంగా చికిత్స, మందులు అందజేస్తామని తెలిపారు. అలాగే పోషకాహారం కోసం ప్రభుత్వం ప్రతి నెలా ఆర్థిక సహాయం అందిస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, క్షయ వ్యాధి పర్యవేక్షకుడు వెంకట్ , వైద్య సాంకేతిక నిపుణుడు సాయి కృష్ణ, ఏఎన్ఎమ్ నాగజ్యోతి, ఆశా కార్యకర్తలు రాములమ్మ, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# సామ్రాజ్యవాద శక్తులు ప్రపంచ శాంతిని భంగం చేస్తున్నాయి

- డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేసిన సీపీఐ నేతలు.



**పాల్వంచ, మార్చి 16, ప్రజాజ్యోతి:** సామ్రాజ్యవాద శక్తుల చర్యలు ప్రపంచ శాంతిని విచ్ఛిన్నం చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యుద్ధోన్మాద విధానాలు ప్రపంచ దేశాలకు ప్రమాదకరంగా మారుతున్నాయని తెలిపారు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధ చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పాల్వంచలో సీపీఐ ఆధ్వర్యంలో డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం శోచనీయమని విమర్శించారు. అమెరికా ఒత్తిళ్లకు లోబడి కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని ఆరోపించారు. భారత ప్రభుత్వ ఆహ్వానం మేరకు నావికా విన్యాసాలకు వచ్చిన ఇరాన్ నౌకపై అమెరికా దాడి చేసినప్పటికీ కేంద్రం ఖండించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. 160 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై కూడా అమెరికా ఒత్తిడితో కేంద్రం స్పందించకపోవడం దేశ సార్వభౌమాధికారానికి భంగం కలిగించేదిగా ఉందని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతో సామాన్య ప్రజలపై ధరల భారం పెరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సామాన్యుల వంటింటిపై మోయలేని భారాలు మోపుతున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు.పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని పేర్కొన్నారు. సామ్రాజ్యవాద దేశాలు స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న కుట్రలను ప్రపంచ దేశాలు ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, మున్సిపల్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, గౌతమి కృష్ణ, వల్లపు యాకయ్య, వైఎస్ గిరి, ఉప్పుశెట్టి సునీల్, మద్దినేని నాగమణి, వగ్గల పద్మ, ఎస్.ఏ. రెహమాన్, కోరే కృష్ణ, కాసర్ల రామారావు, బార్ల వెంకటరత్నం, హైమద్ జానీ, నామ పండు, రవీందర్, బాబురావు, గాజుల సత్యనారాయణ, బిక్కులాల్, అమీర్, వెంకటేష్, అంబడిపూడి నరేంద్ర, అద్దంకి బాబు, కాకాటి రాజేష్, భట్టు శంకర్, కోమటి శ్రీను, అల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కేంద్ర ఉక్కు శాఖా మంత్రితో యన్. యమ్. డీ. సి స్పాంజ్

- ఐరన్ యూనిట్ పాల్వంచ ప్లాంట్ పునరుద్ధరణకు చర్చిస్తా
- యంపి రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి16, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఖాయిలా పడ్డ యన్. యమ్. డీ. సీ ప్లాంట్ ను పునరుద్దరణ కు కేంద్ర ఉక్కుశాఖా మంత్రి కుమారస్వామితో మాట్లాడి యూనిట్ పునరుద్ధరణకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి ఐ ఎన్ టి యు సి నాయకులకు హామీ ఇచ్చారు , రేణుక చౌదరి సోమవారం సూర్యాపేట వచ్చిన సందర్భంగా స్థానిక ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు ఎస్ ఏ జలీల్ , పాల్వంచ 33వ డివిజన కార్పొరేటర్ బాలు నాయకులు కలిసి ఎన్ఎండిసి యూనిట్ పునరుద్ధరణ పై చర్చించారు, ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జలీల్, కార్పొరేటర్ బాలు నాయకులు మాట్లాడుతూ ఎన్ఎండిసి యూనిట్ పునరుద్ధరణకు ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి తో మాట్లాడి స్పాంజ్ యూనిట్ను పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని , రంజాన్ తర్వాత తమను ఢిల్లీకి రావాలని రేణుక చౌదరి తమను కోరినట్లుగా చెప్పారు, అనంతరం రేణుక సోదరుని ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు, రేణుక చౌదరిని కలిసిన వారిలో ఐ. యన్. టీ. యూ. సి పాల్వంచ పట్టణ ప్రధాన కార్యదర్శి శనగ రామచందర్ రావు, బానోత్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పెంటర్స్ అందరూ ఐక్యంగా ఉండాలి

- అసోసియేషన్ అధ్యక్షులు రమణాచారి



**పినపాక,మార్చి 16(ప్రజాజ్యోతి):** కార్పెంటర్స్ అందరూ ఐక్యంగా ఉంటూ ఒకరికొకరు సహకరించుకోవాలని కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోయిలకుంట్ల రమణాచారి అన్నారు సోమవారం పినపాక మండలంలోని ఏడుళ్ల బయ్యారం గ్రామంలో కార్పెంటర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పెంటర్ల వృత్తి అభివృద్ధి, కార్పెంటర్లకు ఎదురవుతున్న సమస్యలు, ప్రభుత్వ సహాయం వంటి అంశాలపై చర్చించారు. కార్పెంటర్లకు ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు అందించాలని సభ్యులు కోరారు. అలాగే ఆధునిక పరికరాలు, శిక్షణ కార్యక్రమాలు అందించి వృత్తిని అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం బలోపేతానికి సభ్యులంతా ఐక్యంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తంగెల్లపల్లి సురేష్, సింహాద్రి వీరభద్రం ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# సీహెచ్సీలో ముమ్మరంగా హెచ్పీవీ వ్యాక్సిన్



**బూర్గంపహాడ్, మార్చి 16 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ సీహెచ్సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్ )లో హెచ్పీవీ (గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ ) నివారణ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు ఆధ్వర్యంలో ముమ్మరంగా చేపట్టారు. ఈనెల 8న ప్రారంభమైన ఈ వ్యాక్సిన్ కార్యక్రమంలో భాగంగా 14 ఏళ్లు దాటిన ఆడపిల్లలకు నివారణ వ్యాక్సిన్ అందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలో వ్యాక్సిన్ కోసం 535 మందిని గుర్తించామని, పిల్లలకు పరీక్షలు, ఎండల కారణంగా ప్రతిరోజూ కొద్దిమందికే వ్యాక్సిన్ వేయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ వ్యాక్సిన్ కార్యక్రమం 60శాతం పూర్తయిందని తెలిపారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, అధికారుల ద్వారా విస్తృతంగా ప్రచారం జరిగిందన్నారు. అనంతరం వైద్యం పొందుతున్న రోగుల వార్డులోకి వెళ్లి యోగక్షేమాలు, ఆరోగ్యస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

- తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా



**బూర్గంపహాడ్, మార్చి 16 (ప్రజా జ్యోతి):** పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించా రు. సీపీఐ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఇరాన్ పై ఇజ్రాయిల్ ,అమెరికా దాడులు నిలుపుదల చేయాలని, యుద్ధాల వల్ల దేశంలో పెరిగిన నిత్యావసర వస్తువుల్లో భాగమైన గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలని, గ్యాస్ ధరల కారణంగా సామాన్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీటీ సమ్మయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అలవాల సీతారామిరెడ్డి, మండల నాయకులు సిద్ధారపు సుబ్బారెడ్డి, ముదిగొండ బాలకృష్ణ, బలరాం, కూరపాటి దాసు, కుంజా నాగరాజు, సింగబోయిన వెంకటేశ్వర్లు, సోయం విజయబాబు, కొమరం రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం





**చంద్రుగొండ , మార్చి 16 .ప్రజా జ్యోతి** ఇటీవల అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు, అట్టి కేసులో ఖననం చేయబడిన మృతదేహానికి జూలూరుపాడు సిఐ శ్రీ లక్ష్మి, ఎస్సై శివరామక్రిష్ణల పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళితే... చంద్రుగొండ మండలం, తిప్పనపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ జాఫర్(33) ఈ నెల 11న అనుమానస్పదస్థిలో మృతి చెందాడని సోదరుడు జావిద్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పురోగతిలో భాగంగా సోమవారం తిప్పనపల్లి శ్మశానవాటికలో పూడ్చిన మృతదేహన్ని బయటకి తీసి, పోస్టుమార్టం చేసి, తిరిగి మళ్లీ ఖననం చేశారు. త్వరలో కేసు వివరాల్ని తెలియజేస్తామని సిఐ శ్రీలక్ష్మి తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై శివరామక్రిష్ణ బందోబస్తు నడుమ పోస్టుమార్టం కార్యక్రమం నిర్వహించారు.

# రోగులకు స్వచ్ఛమైన తాగునీరు

- ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి వాటర్ డిస్పెన్సర్ వితరణ



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 16 – ప్రజాజ్యోతి:** చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి వచ్చే రోగులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు దాతలు ముందుకొచ్చారు. తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ విద్యానగర్, కొత్తగూడెం ఆధ్వర్యంలో సోమవారం సభ్యులు జిఎంవీ ప్రసాదరావు, దండమూడి ధర్మారావు ల ఆర్థిక సహకారంతో విద్యానగర్లో వున్న లో సుమారు ఇరవై ఐదు వేల రూపాయలు విలువైన బ్లూ స్టార్ వాటర్ డిస్పెన్సెర్, రెండు కుర్చీలు, ఒక టేక్ వుడ్ ఆఫీసు టేబుల్ వితరణ అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఈ సంవత్సరం 20 అంగన్వాడీ కేంద్రాల్లో, మూడు ఆశ్రమాల్లో హెల్త్ సెంటర్లో సేవా కార్యక్రమాలను నిర్వహించటం జరిగిందన్నారు. అలాగే అసోసియేషన్ సభ్యులు 75 మంది ఉన్నారని ప్రతి సభ్యుడు కుటుంబం నుంచి ఒక సేవా కార్యక్రమాన్ని సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ కాలనీ గ్రామ పంచాయతీ సర్పంచ్ భూక్యా శాంతిశ్రీ, ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి, వార్డు మెంబర్లు జకరయ్య, శంకర్, పత్రి రమ, పూర్ణ, సెక్రటరీ వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది అమర్నాథ్, రామకృష్ణ, కిషోర్, సీనియర్ సిటిజన్స్ సభ్యులు, గ్రామ పెద్దలు, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## అబ్బో ! ఇసుక అక్రమార్కుల హవా?

- పట్టపగలే ట్రాక్టర్లతో ఇసుక స్వాహా
- " అధికారుల నిర్లక్ష్యమా" "ముడుపుల మహిమే"దీనికి కారణమా?



**అశ్వాపురం, మార్చి 16, ప్రజా జ్యోతి దినపత్రిక** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం చింతిర్యాల గ్రామం గోదావరి నది నుంచి అనుమతులు లేకుండా పట్టపగలే జోరు జోరుగా 15 నుంచి 20 ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మండల తహసిల్దార్ కి మరియు మండల సర్కిల్ ఇన్స్పెక్టర్ కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది తో గోదావరి తీరానికి బయలుదేరగా దారి మధ్యలో వస్తున్న ట్రాక్టర్ ని ఆపి పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లి కేసు నమోదు చేశారు. గతంలో ఎన్నో ట్రాక్టర్లు పట్టుకొని కేసు నమోదు చేసిన వీళ్ళ ఆగడాలకు అంతులేకుండా పోతున్నాయి. ఇది ఇలా ఉంటే నది తీరంలో ఎన్నో ట్రాక్టర్లు ఉన్న దారి మధ్యలో వచ్చే ట్రాక్టర్ ఆపి కేసు నమోదు చేసి మిగతా ట్రాక్టర్ల పై కేసు నమోదు చేయకపోవడంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. దీనిపై జిల్లా ఉన్నత అధికారులు విచారణ జరిపించాలని మండలం ప్రజలు కోరుకుంటున్నారు.

## పట్టపగలే మహిళ పర్సు చోరీ




**టేకులపల్లి,మార్చి16,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలోని బోడు రోడ్ సెంటర్లో ఉన్న బాలాజీ మెడికల్ షాప్ లో సోమవారం మందులు తీసుకుంటున్న శ్రీలత పర్సు చోరీ చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బాలాజీ మెడికల్ షాప్ దగ్గర మందులు కొంటున్న బోడు గ్రామానికి చెందిన కుంపటి శ్రీలత అనే యువతీ వద్ద ఉన్నటువంటి చేతిలో కవర్లో ఉన్న పర్సును గుర్తుతెలియని ఇద్దరి మహిళలు దొంగలించడం జరిగినది అని ఎస్ఐ రాజేందర్ తెలిపారు.ఆ పర్సులో పది వేల రూపాయలు ఉన్నాయాని సదురు మహిళా టేకులపల్లి పోలీస్ స్టేషన్లో పిర్యాదుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టేకులపల్లి ఎస్సై ఎ. రాజేందర్ తెలిపారు.

## మహిళను వేధించిన కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

- 5వేల రూపాయలు జరిమాన

**టేకులపల్లి,మార్చి16,ప్రజాజ్యోతి:** మహిళను వేధించిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి ఇల్లందు న్యాయస్థానం జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. కేసు వివరాలు టేకులపల్లి మండలం పానుగోతు తండ చెందిన భూక్య చంద్ర శేఖర్ అనే వ్యక్తి ఓ మహిళను తరచూ వేధింపులకు గురి చేయడంతో ఆ మహిళ టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై బి. శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేసి నివేదికను కోర్టుకు సరెండర్ చేశారు.విచారణలో భూక్య చంద్ర శేఖర్ దోషిగా తేలడంతో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఇల్లెందు జడ్జి డి.చంద్రిక రెడ్డి తీర్పు వెలువరించారు.ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగు అనిల్ కుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదించగా,కోర్టు కానిస్టేబుల్ రమేష్, రమణ లు సహకరించారు.

# నవమికి భద్రాచలం పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి...)
తదితర అంశాలపై మంత్రి అధికారులకు కీలక దిశానిర్దేశం చేశారు.

### ››› నవమికి సీఎం రేవంత్ భద్రాచలం పర్యటన

శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటనకు రానున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, రవాణా, వసతి వంటి అంశాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల సేవలో ప్రభుత్వం అనే నినాదంతో సేవలు అందించాలని అధికారులకు తెలిపారు.

### ››› రూ.100 కోట్లతో భద్రాద్రి ఆలయ పనులకు శంకుస్థాపన

భద్రాద్రి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.300 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించిందని మంత్రి తెలిపారు. మొదటి విడతగా సుమారు రూ.100 కోట్లతో చేపట్టనున్న ప్రాకారం నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. కొత్తగూడెం నుంచి భద్రాచలం వరకు డివైడర్లు, సెంటర్ లైటింగ్, పూల మొక్కలు వంటి సుందరీకరణ పనులు ఉగాది నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

### ››› సీతారామ డిస్ట్రిబ్యూటరీ పనులు వేగవంతం

జిల్లాలో సాగునీటి విస్తరణకు కీలకమైన సీతారామ డిస్ట్రిబ్యూటరీ పనులకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. యాతాలకుంట టన్నెల్‌లో మిగిలిన సుమారు 100 మీటర్ల పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 50 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని తెలిపారు.

### ››› పాండురంగాపురం–మల్కానగిరి రైల్వే లైన్‌కు ప్రాధాన్యం

భద్రాద్రి అభివృద్ధికి కీలకమైన పాండురంగాపురం–మల్కానగిరి రైల్వే లైన్‌కు అనుమతి లభించిందని మంత్రి తెలిపారు. మొదటి దశలో సారపాక వరకు భూసేకరణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

### ››› పర్యాటకాభివృద్ధికి రైల్వే లైన్ కీలకం

ఈ రైల్వే లైన్ పూర్తయితే దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి ప్రాంతానికి పర్యాటకంగా మరింత ప్రాధాన్యం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని బిపిఎల్, హెవీ వాటర్ ప్లాంట్లకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.

### ››› ఎయిర్‌పోర్ట్‌కు అనుకూల భూమి గుర్తించాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం నిర్మాణానికి అనుకూలమైన భూమిని గుర్తించాలని మంత్రి కలెక్టర్‌ను ఆదేశించారు .భద్రాచలం–కొత్తగూడెం మధ్య ప్రాంతంలో అనువైన స్థలాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు.

### ››› పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలి

కొత్తగూడెం–భువనగిరి రహదారి పరిధిలో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రహదారి అభివృద్ధి వల్ల రవాణా, వ్యాపార కార్యకలాపాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

### ››› ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి తుమ్మల సూచించారు. సబ్సిడీ పథకాల ద్వారా రైతులకు అధిక ఆదాయం సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన ఈ ప్రాజెక్టుల అమలుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.

## కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో క్రీడా పాఠశాల ఎంపికల పోటీలు ప్రారంభం





**పాల్వంచ మార్చి 16, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో సోమవారం క్రీడా పాఠశాల ఎంపికల పోటీలను దమ్మపేట సహాయ గిరిజన సంక్షేమ అధికారి ఎస్. చంద్రమోహన్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. పోటీలకు హాజరైన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఏఎస్ఓ వెంకటనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాటరీ టెస్ట్ మరియు ఫిజికల్ ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించారు. కిన్నెరసాని క్రీడా పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలలో మొత్తం 66 మంది బాలురు, 35 మంది బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఈ నెల 28, 29, 30 తేదీలలో తుది ఎంపికలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎన్. చందు, జిల్లా సహాయ క్రీడాధికారులు ఎస్. నాగేశ్వరరావు, కొమరం వెంకటనారాయణ, పీడీలు బాలసుబ్రమణ్యం, రమేష్, రామారావు, రాంబాబు, పీఈటీలు గోపాలరావు, ముత్తయ్య, రాంబాబు, బాబురావు, సంపత్, కృష్ణారావు, వెంకటేశ్వర్లు, అంజయ్య, కోచ్‌లు వాసు, ప్రసాద్, సంజిత్ మండల్, ఎ. దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు

## పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో శ్రీనివాసగిరి శ్రీ భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం



**పాల్వంచ, మార్చి 16, ప్రజాజ్యోతి:** శ్రీనివాస కాలనీలో ఉన్న శ్రీనివాసగిరి ఆలయంలో జరుగుతున్న శ్రీ భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం చతుస్థానార్చన, మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణం, చక్రస్నానం, వసంతోత్సవం, సంప్రోక్షణ, మహాదాశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజలను సౌమిత్రి రామాచార్యులు, ఎడవల్లి హరిదాసార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. అనంతరం యజ్ఞకార్యక్రమాల్లో పాల్గొన్న పురోహితులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. వసంతోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులు భక్తి పరవశంలో మునిగిపోయారు. కార్యక్రమంలో శ్రీనివాసగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఆరుట్ల లక్ష్మణాచారి, భక్తసమాజ మండలి అధ్యక్షుడు ఊకే భద్రయ్య, కార్యదర్శి తాటికొండ శ్రీలత, కోశాధికారి పిట్ట లక్ష్మీరెడ్డి, గౌరవ సలహాదారులు వంకదారు నరసింహ కుమార్, సహాయ కార్యదర్శి ఏటుకూరి నరేష్, సేవాదళ్ అధ్యక్షుడు కొండు శివ, కార్యదర్శి పరిశిక కిరణ్, మహిళా సంఘం అధ్యక్షురాలు నిడమనేని అనూష, కార్యదర్శి రేనాటి స్రవంతి పాల్గొన్నారు. ఆదివారం స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించగా సాయంత్రం చతుస్థానార్చన, అగ్నిముఖం, నిత్య పూర్ణాహుతి, సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ, దర్బార్ సేవ, పవళింపు సేవలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# దోస్త్ మేరా దోస్త్...

- పదవి పెరిగినా... స్నేహం మారలే
- బాల్య మిత్రుడిని ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే
- లయన్స్ క్లబ్ జోనల్ మీట్‌లో హృద్య ఘటన



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 16 (ప్రజా జ్యోతి):** పదవులు, హోదాలు ఎంత పెరిగినా నిజమైన స్నేహానికి అవి అడ్డుకావని చెప్పే హృద్యమైన సంఘటన భద్రాచలం పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణంలోని గోదావరి ఇన్ హోటల్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్ జోనల్ మీట్ కార్యక్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ కురిచేటి శ్రీనివాస్ ఆహ్వానం మేరకు ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వచ్చిన లయన్స్ క్లబ్ సభ్యుడు, మణుగూరులోని జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తన బాల్య మిత్రుడు ఎమ్మెల్యేను చూసి మర్యాదపూర్వకంగా "నమస్తే సార్" అంటూ పలకరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చిరునవ్వుతో "సార్ ఏంటి రా... మనం ఇద్దరం చిన్నప్పటి ఫ్రెండ్స్, రూమ్‌మేట్స్ కదా!" అంటూ ఆప్యాయంగా దగ్గరకు పిలుచుకుని మాట్లాడారు. తన బాల్య మిత్రుడిని అక్కడే ఉన్న తన సతీమణికి పరిచయం చేస్తూ ఇద్దరూ కలిసి చదువుకున్న రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశలో గడిపిన అనుబంధాన్ని స్మరించుకుంటూ కొంతసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ దృశ్యం కార్యక్రమానికి హాజరైన లయన్స్ క్లబ్ సభ్యులు, అతిథులను ఎంతో ఆకట్టుకుంది. ప్రజా ప్రతినిధిగా ఉన్నప్పటికీ తన బాల్య మిత్రుడిని అదే అనురాగంతో పలకరించడం ఎమ్మెల్యే సరళ స్వభావాన్ని ప్రతిబింబించిందని పలువురు అభిప్రాయపడ్డారు. పదవులు, అధికారాలు పెరిగినా నిజమైన స్నేహం మాత్రం మారదని ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది.

# ఆళ్ళపల్లిలో వైభవంగా కంఠమహేశ్వర స్వామి కల్యాణం

- భారీ అన్నదానం



**ఆళ్ళపల్లి,మార్చి16. ప్రజా జ్యోతి** ఆళ్ళపల్లిలోని ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాంబ దేవి కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం భక్తుల సందోహంతో విజయవంతమైంది. గ్రామ పెద్దలు గౌరీశెట్టి శ్రీనివాసరావు, రేసు ఎల్లయ్య, మహమ్మద్ అతహర్ ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, అమ్మవారికి బోనాలు సమర్పించారు. నిర్వాహకులగౌడ కులదైవాల విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భముగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కుల పెద్ద శ్రీరాం సమ్మయ్య, ఆలయ కమిటీ చైర్మన్ కోరుకొప్పుల రాజన్న, సారకల్లు గౌడ్, పానుగంటి వెంకటేశ్వర్లు తెలిపారు. పాల్గొన్న ముఖ్యులు: ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు దీకొండ మల్లేష్, బుర్ర వెంకన్న, రేసు సూరిబాబు, తెలగాని పురుషోత్తం, రేసు రాము, తిరుమలేష్, చంద్రబాబు, శ్రీరామ్ సంపత్, సతీష్, మంద సాయిరాజ్, కార్తీక్, గణేష్, లక్ష్మణ్ రెడ్డి, మల్ల సమ్మయ్య, రాజు, నరేష్, సందీప్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ రైతుల హక్కులపై ప్రైవేట్ కంపెనీల కుట్రలు అడ్డుకుంటాం

- రైతులకు న్యాయమైన ధర కోసం పోరాటం
- హైకోర్టులో పోరాటానికి సిద్ధం: ఆలపాటి రామచంద్ర ప్రసాద్



**దమ్మపేట, మార్చి. 16,(ప్రజాజ్యోతి):** ఆయిల్ పామ్ రైతుల హక్కులను దెబ్బతీసే విధంగా గెలల ధర నిర్ణయంలో ప్రైవేట్ కంపెనీలు చేస్తున్న కుట్రలను న్యాయపరంగా తిప్పికొడతామని ఆయిల్ పామ్ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. సోమవారం మండలంలోని అల్లిపల్లి గ్రామంలో నిర్వహించిన ఆయిల్ పామ్ రైతుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో అశ్వరావుపేట, పెదవేగి ఆయిల్ పామ్ కర్మాగారాల్లో ఉత్పత్తి అయ్యే నూనె దిగుబడిని సరాసరి చేసి గెలలకు ధర నిర్ణయం చేసేవారని గుర్తు చేశారు. అయితే రాష్ట్ర విభజన అనంతరం అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో అప్పారావుపేటలో అత్యాధునిక సాంకేతికతతో, అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో కొత్త ఆయిల్ పామ్ కర్మాగారం నిర్మించబడిందని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా రైతులు పండించే ఆయిల్ పామ్ గెలలను ప్రాసెస్ చేయడంలో అశ్వరావుపేట, అప్పారావుపేట కర్మాగారాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఏదైనా కారణంతో అశ్వరావుపేట కర్మాగారం నిలిపివేస్తే అప్పారావుపేటలో, అప్పారావుపేట కర్మాగారం ఆగితే అశ్వరావుపేటలో గానుగ ఆడే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు.రెండు కర్మాగారాల్లో అత్యధిక నూనె దిగుబడి సాధించిన కర్మాగారాన్ని ఆధారంగా చేసుకుని రైతులకు గెలల ధర నిర్ణయించాలని ఆయిల్ పామ్ రైతు సంఘం తరపున సాగించిన పోరాటం ఫలించిందని తెలిపారు. గత ఐదేళ్లుగా అత్యధిక నూనె దిగుబడి సాధిస్తున్న అప్పారావుపేట ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ఆధారంగా చేసుకుని రైతులకు గెలల ధరను ఆయిల్ ఫెడ్ చెల్లిస్తోందని పేర్కొన్నారు.అయితే రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క కర్మాగారం కూడా పూర్తి చేయని ఏడు ప్రైవేట్ కంపెనీలు కలిసి రైతులకు అన్యాయం జరిగే విధంగా అశ్వరావుపేట, అప్పారావుపేట కర్మాగారాల ఆయిల్ రికవరీని సరాసరి చేసి గెలల ధర నిర్ణయించాలని హైకోర్టును ఆశ్రయించడం తీవ్రంగా ఖండనీయమని అన్నారు. ఇది రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ప్రయత్నమని ఆరోపించారు. ప్రైవేట్ కంపెనీల ఈ కుట్రలను అడ్డుకుని రైతులకు అత్యధిక దిగుబడి ఆధారంగా న్యాయమైన ధర దక్కేలా చేయడానికి ఆయిల్ పామ్ రైతు సంఘం తరపున సుప్రీంకోర్టు , హైకోర్టుకు చెందిన ఇద్దరు ప్రముఖ న్యాయవాదులతో ఈ నెల 26న హైకోర్టులో బలమైన వాదనలు వినిపించనున్నట్లు తెలిపారు. రైతుల హక్కుల కోసం అవసరమైతే న్యాయపోరాటంతో పాటు ప్రజా పోరాటం కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రైతు నాయకులు పైడి వెంకటేశ్వరరావు, కె.వి. సత్యనారాయణ, కొయ్యల అచ్యుతరావు, దొడ్డ ప్రసాద్, ఎర్ర వసంతం, మనం అప్పారావు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెగుట్టలో లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

- పలు గ్రామాల్లో పరామర్శలు, నివాళులు





**దమ్మపేట, మార్చి. 16,(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం గొర్రెగుట్ట గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి స్వయంభూ క్షేత్రంలో జరుగుతున్న ఏకాదశ (11వ) వార్షికోత్సవాల సందర్భంగా అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మెచ్చా నాగేశ్వరరావును శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. దమ్మపేట మండలం దురదపాడు గ్రామానికి చెందిన కుర్సం రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అలాగే శ్రీరాంపురం గ్రామానికి చెందిన వెంపాటి సూర్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇదే విధంగా సరోజినీపురం గ్రామానికి చెందిన బండి తిరుపతయ్య మృతి పట్ల కూడా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో పైడి లక్ష్మణ్‌రావు, ఓబులు సత్యనారాయణ, ధనేకుల కృష్ణారావు, యలమంచి రమణరావు, తాటి ప్రదీప్ చంద్ర, వల్లభనేని వీరభద్రరావు, ఉప సర్పంచ్ గరిమెళ్ల శ్రీరామ్ మూర్తి, వార్డ్ మెంబర్ మోదుగు వేణు, తుమ్మల లక్ష్మణ్‌రావు, చీకటి శ్రీనివాస్‌రావు, నరాలశెట్టి చెన్నారావు, పర్వతనేని రాజా, బొంతు ప్రసాద్, విజయ్, బండి ప్రసాద్, బండి సురేంద్ర, సాంబశివరావు, మండల బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు మండవ సత్య, పాయం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# బేతంపూడిలోలక్ష్మీనరసింహస్వామి జాతర వేడుకలు



**టేకులపల్లి,మార్చి16,ప్రజాజ్యోతి :** మండలంలోని బేతంపూడి గ్రామంలో ఈ నెల 19 వ తేదిన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటన లో సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా స్వామివారిని ప్రభబండ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లనున్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. అదేరోజు సాయంత్రం 7 గంటలకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

## జామే మసీదులో మంచినీటి సమస్యకు పరిష్కారం

- **బోరు మంజూరు చేసిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**



**పాల్వంచ, మార్చి 16, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని 37వ డివిజన్ పరిధిలో ఉన్న జామే మసీదు కాంప్లెక్స్‌లో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బోరు మంజూరు చేశారు. సోమవారం స్థానిక జామే మసీదు ప్రాంగణంలో మంచినీటి సమస్య నివారణకు బోరు త్రవ్వించారు.ఆదివారం రాత్రి జామే మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కార్పొరేటర్ మల్లెల స్వప్న కుమారి పాల్గొన్నారు. రంజాన్ ఉపవాస ప్రార్థనల నేపథ్యంలో మసీదు వద్ద మంచినీటి సమస్య ఉందని మసీదు పెద్దలు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన నిధులను ఎంపీ అందజేశారు.కార్పొరేటర్ మల్లెల స్వప్న కుమారి స్థానిక పెద్దల సమక్షంలో మసీదు కాంప్లెక్స్‌లో బోరు త్రవ్వించే కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో మసీదులో నెలకొన్న మంచి నీటి సమస్యకు పరిష్కారం లభించింది.ఈ కార్యక్రమంలో జామే మసీదు అధ్యక్షుడు ఫయాజ్ అస్లాం, కార్యదర్శి ఎస్కే ఇబ్రహీం, కోశాధికారి ఎస్కే మీర సాహెబ్, ఫారుక్, మౌలానా, టీఆర్ఎస్ జిల్లా నాయకుడు మల్లెల రవిచంద్ర, మాజీ సహకార సంఘం అధ్యక్షుడు బోడెపూడి ప్రసాద్ (చిన్న), చలపతి, జి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై ఐటీడీఏ పీవోకి వినతి



**బూర్గంపహాడ్,మార్చి16, (ప్రజా జ్యోతి):** గ్రామంలో ఉన్న వివిధ సమస్యలను ప రిష క్రరించాల నే ఉద్దేశంతో కృష్ణ సాగర్ పంచాయతీ గ్రామ సర్పంచ్ తాటి వాణి,ఉప సర్పంచ్ భూక్య మోహన్ రావులు సోమవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీవో రాహుల్ కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న పలు అభివృద్ధి పనులు అంగన్వాడి బిల్డింగ్స్, కిచెన్ షెడ్, ఎంపీపీఎస్ పాఠశాల ప్రహరీ గోడ, ఊర్ల దోస పాడు గ్రావెల్ రోడ్, గ్రామపంచాయతీ బిల్డింగ్ పూర్తి చేయుటకు మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను పీవో దృష్టికి తీసుకువెళ్లారు.పాలక వర్గ సభ్యులు అందజేసిన వినతి పత్రాన్ని పరిశీలించిన పీవో రాహుల్ సమస్యలపై సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కృష్ణ సాగర్ వార్డ్ సభ్యులు కుంజ రజిని,అంతోటి కృష్ణలీల,కురసం రేవతి, ఉసిల్ల రాజేష్, బాదవత్ సురేష్,బానోత్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## బహుజన సాహిత్య అకాడమీ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో అవార్డులు అందుకున్న దండోరా శ్రీను, గుర్రం వెంకటరత్నం



**పాల్వంచ, మార్చి 16, ప్రజాజ్యోతి:** తిరుపతిలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 18వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ కార్యక్రమం సందర్భంగా అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నేషనల్ అవార్డును దండోరా శ్రీను స్వీకరించారు. అలాగే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డును గుర్రం వెంకటరత్నం అందుకున్నారు.తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. సామాజిక సేవ, బహుజన సంక్షేమం కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డులను ప్రదానం చేశారు.బహుజన సాహిత్య అకాడమీ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో స మానత్వం, సామాజిక న్యాయం సాధనకు కృషి చేస్తున్న వ్యక్తులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ అవార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సామాజిక కార్యకర్తలు, సాహితీవేత్తలు, బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఘన నివాళి

- **ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో పూలమాలంకరణ**



**పాల్వంచ, మార్చి 16, ప్రజాజ్యోతి:** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలంకరణ చేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు చలవాది ప్రకాష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు భారత స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, ఇంజనీర్, ఆంధ్ర రాష్ట్ర స్థాపనకు కృషి చేసిన మహానేత అని తెలిపారు. హరిజనులు, దళితులకు ఆలయ ప్రవేశం కల్పించేందుకు నిరాహార దీక్ష చేపట్టి అహింసా మార్గంలో విజయం సాధించిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు.తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అప్పటి మద్రాసులో 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టారని తెలిపారు. 1952 డిసెంబర్ 15న ఆయన మరణంతో దేశ వ్యాప్తంగా నిరసనలు చెలరేగాయని గుర్తుచేశారు. ఆ పరిణామాల ఫలితంగా 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. ఆ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన చారిత్రక పరిణామాల వల్లే తరువాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడేందుకు మార్గం సుగమమైందని వివరించారు.పొట్టి శ్రీరాములు ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో కూడా పాల్గొని బ్రిటిష్ పాలనలో అనేకసార్లు జైలు శిక్షను అనుభవించిన మహానుభావుడని తెలిపారు.ఆర్యవైశ్య మహాసభ మహిళా నాయకురాలు పెండ్యాల రోజాలక్ష్మి, మం డల నాయకులు గూడెపు శ్రీనివాస్, కంటాల జగదీష్, గర్రె శివ, వంకధార ఇంది రా, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రతిమ, శ్రీనివాస్, సంగమేశ్వరరావు, బ చ్చు మూర్తి, తాటి శ్రీనివాస్, ఉప్పల వెంకటేశ్వర్లు, పండ్లకొట్టు వెంకన్న పాల్గొన్నారు.

## పోలీస్ వాహనాలను ఎల్లప్పుడూ మంచి కండీషన్‌లో ఉంచాలి

- **ఎస్పీ రోహిత్ రాజు**
- **హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ వాహనాల తనిఖీ**



**కొత్తగూడెం, మార్చి 16 ( ప్రజాజ్యోతి ):** జిల్లాలోని పోలీస్ స్టేషన్లు మరియు ఇతర అధికారులకు కేటాయించిన పోలీస్ వాహనాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం తనిఖీ చేశారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ వాహనాల రవాణాధికారి ఆర్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల పరిస్థితిని ఎస్పీ స్వయంగా పరిశీలించి డ్రైవర్లతో మాట్లాడి వారి సమస్యలు, విధుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనం సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని వాహనాలను ఎప్పుడూ మంచి కండీషన్‌లో ఉంచాలని డ్రైవర్లకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ వాహనాల పాత్ర అత్యంత ముఖ్యమని అత్యవసర సమయాల్లో ప్రజలకు సేవలు అందించడంలో డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తారని ఎస్పీ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలని విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డ్రైవర్లకు సూచించారు. అత్యవసర విధులు నిర్వహించే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల పరంగా ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ (ఎంటిఓ) సుధాకర్, అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు భూ కేటాయింపు త్వరితగతిన పూర్తిచేయాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**




**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 16 ,ప్రజా జ్యోతి:** జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా అమలుకావాలంటే అవసరమైన భూమి కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో భూమి కేటాయింపు, భూమి అవసరాల అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల పరిధిలో అమలులో ఉన్న అభివృద్ధి పనులపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఆయా శాఖల ద్వారా మంజూరైన పనుల వివరాలు, వాటి ప్రస్తుత పురోగతి, ఎప్పుడు మంజూరు అయ్యాయి, ఇప్పటివరకు ఎందుకు పెండింగ్ లో ఉన్నాయి అనే అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా ఏ పథకం కింద పనులకు మంజూరు లభించింది, పనుల అమలుకు ఎంత భూమి అవసరం ఉంది, భూమి కేటాయింపులో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి, అటవీ భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నాయా వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో ప్రజలకు ఉపయోగపడే పలు అభివృద్ధి పనులు భూమి సమస్యల కారణంగా ఆలస్యం కాకుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన భూమి గుర్తింపు, కేటాయింపు ప్రక్రియలను వేగవంతం చేసి పనులు త్వరగా ప్రారంభం కావడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. భూమి కేటాయింపుకు సంబంధించిన ప్రతిపాదనలను పూర్తి వివరాలతో సమర్పించి, పెండింగ్ లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అన్ని శాఖలు తమ శాఖల పరిధిలో అమలులో ఉన్న పనులపై సమగ్ర సమాచారం సేకరించి, మంజూరైన పనులు, వాటి పురోగతి, భూమి అవసరాలు, పెండింగ్ కు కారణాలు వంటి అంశాలను వివరంగా పొందుపరుస్తూ నివేదికలను సిద్ధం చేసి జిల్లా పరిపాలనకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు త్వరగా అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు .ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా, బీసీ సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని శ్రీలత, నీటిపారుదల శాఖ ఈఈ అర్జున్ రావు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఇల్లందు, అశ్వరావుపేట, మణుగూరు మున్సిపల్ కమిషనర్ లు జిల్లా పంచాయతీ అధికారి సుధీర్, విద్యుత్, వ్యవసాయ, అటవీ, ట్రైబల్ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వెబ్రిడ్జి తో సింగరేణికి వందలాది టన్నుల బొగ్గు నష్టం

- కెఓసి పిఓ అలసత్వమే కారణమా..?
- నష్టపోయిన బొగ్గు రికవరీ చేయరా..!






**టేకుల పల్లి, మార్చి 16, ప్రజాజ్యోతి:** ఇల్లందు ఏరియా కోయగూడెం ఓసి పిఓ అలసత్వమే సింగరేణి సంస్థకు కోట్లాది రూపాయల నష్టాన్ని తెచ్చిపెట్టిందనేది కండ్లకు కనిపిస్తుంది.వేబ్రిడ్జిలో తలెత్తిన లోపాన్ని సకాలంలో గుర్తించకపోవడంతో సింగరేణి యాజమాన్యం భారీ మూల్యం చెల్లించుకుంది. పత్రికల్లో వరుస కథనాలు వస్తే కానీ కెఓసి పిఓ,మేనేజర్ తమ అలసత్వాన్ని వీడలేదు. ఉరుకులు పరుగులు పెడ్తూ రెండు వేబ్రిడ్జిల్లో ఒక వేబ్రిడ్జి లోపం ఉన్నట్లు గుర్తించి గుట్టుచప్పుడు కాకుండా వేబ్రిడ్జి మరమ్మత్తులు చేయిస్తున్నారు. వరుస కథనాలు ఎన్ని వచ్చిన తమకు అయ్యేది ఏమీ లేదంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రజల కట్టే పన్నులతో జీతాలు పొందుతున్న సింగరేణి కెఓసి అధికారులు తమ బాధ్యతలను విస్మరించి విధుల్లో అలసత్వం వహిస్తుండడం విమర్శలకు తావిస్తుంది.

**వందలాది టన్నులు బొగ్గు నష్టం..**

ఇల్లందు ఏరియాలో కోయగూడెం ఓసి ద్వారానే బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. అసలే బొగ్గు ఉత్పత్తిలో ఇల్లందు ఏరియా వెనకంజలో ఉంది.ఈ క్రమంలో కెఓసీ యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి రవాణా లో అప్రమత్తంగా ఉండాలి.అని కార్మికులు ఎంతో శ్రమ కోర్చి తీసిన బొగ్గును రవాణా చేసే విషయంలో కీలకమైన వే బ్రిడ్జిని పర్యవేక్షించడంలో కేఓసి పిఓ, మేనేజర్ ఘోరంగా విఫలమయ్యారని జోరుగా ప్రచారం జరుగుతుంది. అయితే కాకుండా కెఓసిలో వేబ్రిడ్జి లోపాన్ని గమనించిన కొందరు కోల్ కమిషన్ ట్రాన్స్పోర్టర్లు సింగరేణి ఓసీలు 30 టన్నులు లారీలో బొగ్గు వే బిల్లులలో వస్తుండగా, కానీ నిజానికి 31 టన్నులు బొగ్గు ఆ లారీ వస్తుందని అధికారులకు తెలిసిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల, కమిషన్ దారులు ప్రైవేటు కాటాలలో, లేక వారే స్వతహాగా వే బిల్లులను సృష్టించి, పెరిగిన టన్ను బొగ్గును సొమ్ము చేసుకుంటున్నారని నమ్మదగ్గ సత్యమని తెలుస్తుంది. ఈ కారణంగానే కోయగూడెం ఓసి ద్వారా రవాణా చేసిన బొగ్గులో వేలాది టన్నులు వివిధ పరిశ్రమలకు వే బ్రిడ్జి ఫెయిల్యూర్ రూపంలో కోల్పోయింది.

**రికవరీ చేస్తారా..?**

కోయగూడెం ఓసి నుంచి రవాణా అయిన బొగ్గులో వేబ్రిడ్జి తలెత్తిన సాంకేతిక సమస్యను అధికారులు గుర్తించకపోవడంతో వేలాది టన్నుల బొగ్గు ను యాజమాన్యం నష్టపోవాల్సి వచ్చింది.కోయగూడెం ప్రాజెక్టు అధికారి పర్యవేక్షణ లోపం వలన కోట్ల రూపాయలు సింగరేణికి నష్టం వాటిల్లింది. నష్టపోయిన సొమ్మును సింగరేణి యాజమాన్యం రికవరీ చేస్తుందా..? లేదా ..? అనే ప్రశ్నలు ఉత్పనమవుతున్నాయి.

**వివాదాస్పదంగా ప్రాజెక్టు అధికారి శైలి..**

కోయగూడెం ప్రాజెక్టు అధికారి వ్యవహార శైలి వివాదాస్పదమైంది. నిర్వాసిత ప్రజలు, కార్యాలయ సిబ్బంది పట్ల ఆయన ప్రదర్శిస్తున్న వైఖరి చర్చనీయాంశంగా మారింది. 2001లో గని ఆవిర్భావం నుంచి ఎంతోమంది ప్రాజెక్టు అధికారులు ఇక్కడ విధులు నిర్వర్తించారు. అందరికన్నా భిన్నంగా ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ప్రాజెక్టు అధికారి వ్యవహార శైలి ఉండడంతో పాటుగా,సంస్థ ప్రయోజనాల సైతం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న తీరు పై సింగరేణి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల డిమాండ్ చేస్తున్నాయి.

## జీతాలు పెంచమంటే అరెస్టులు చేస్తారా

- అక్రమ అరెస్టులకు అంగన్వాడీ టీచర్ల నిరసన




**చర్ల , మార్చ్ 16:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం అంగన్వాడి టీచర్ల అరెస్టును నిరసిస్తూ అంబేద్కర్ సెంటర్లో మానవహారాన్ని ప్రదర్శించారు. అంగన్వాడీ టీచర్లు హెల్పర్లకు తామ అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని 26 వేల రూపాయలు జీతం ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిందని ఇప్పుడు అధికారంలోకి వచ్చే మూడు సంవత్సరాలు గడుస్తున్నా జీతాలు పెంచలేదని జీతాలు పెంచాలని అడిగినందుకు, హైదరాబాదులో ధర్నా చేసేందుకు వెళుతున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను అక్రమంగా అరెస్టులు చేయటాన్ని హైదరాబాద్ ధర్నాలు పాల్గొన్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ సహా వందలాది మంది సిఐటియు అంగన్వాడీ టీచర్లు హెల్పర్లను అరెస్టులు చేయటాన్ని నిరసిస్తూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు చర్ల ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సి ఐ టి యు నాయకులు కమలమనోహరి,పాలెం నాగమణి,ఇర్పసత్యావతి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పుతుందని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ముఖ్యమంత్రి, మంత్రులు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీ టీచర్లకు,హెల్పర్లకు కనీస వేతనం 26,000 ప్రకటించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాటిటీ చట్టాన్ని అమలు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్ హెల్పర్ పోస్టు భర్తీ చేయాలని అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలపై సర్పంచ్ ల పెత్తనాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన అంగన్వాడీ టీచర్లను హెల్పర్లను సిఐటియు నాయకులు విడుదల చేయాలని ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు .విద్యాశాఖ అమలు చేస్తున్న విధంగా అంగన్వాడీ కేంద్రాలకు కూడా ఒక్క పూట స్కూల్ నిర్వహణ మే నెల మొత్తం డిమాండ్ చేశారు. ప్రభుత్వంపోలీసులను ఉపయోగించి అరెస్టులు చేసి నిర్బంధాన్ని ప్రయోగిస్తే అంతకంటే తీవ్రస్థాయిలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు .ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ నాయకులు సావిత్రి,పాలెం నాగమణి,భానుమతి,వెంకటరమణ,విజయలక్ష్మి ,శాంతి,సత్యవతి,సుహాసిని,శమంతకమణి,రాణి,తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత – మా బాధ్యతపై అవగాహన సదస్సు

**పినపాక,మార్చి 16, ప్రజాజ్యోతి:** మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. “మహిళల భద్రత – మా బాధ్యత” అనే నినాదంతో సోమవారం రాత్రి ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్ ఆదేశాలతో స్థానిక యువకులు, సామాజిక కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న వేధింపులు, దాడులు వంటి సంఘటనలను అరికట్టేందుకు సమాజం మొత్తం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు భయపడకుండా తమ సమస్యలను వెల్లడించేందుకు ముందుకు రావాలని, అవసరమైనప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సమాజంలో మహిళలకు భద్రత కల్పించడం అందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు




## టి ఎన్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ( తోఫా )రంజాన్ కానుకలు

- లక్ష యాభై వేల రూపాయల విలువ చేసే కిట్లు పంపిణి



**సుజాత నగర్ ప్రజాజ్యోతి మార్చి 16 :** మండలం లో పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని సుజాత నగర్ లో టి ఎన్ ఆర్ ట్రస్ట్ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ( తోఫా ) రంజాన్ కానుకలు ఇచ్చారు.2026 మార్చిలో భారతదేశ వ్యాప్తంగా రంజాన్ పవిత్ర మాసం కొనసాగుతోంది. 29 లేదా 30 రోజుల ఉపవాసాలు, ఇఫ్తార్ విందులు, ప్రార్థనలతో ముస్లింలు ఆధ్యాత్మికతతో గడుపుతున్నార. <తాండ్ర నారాయణరావు ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు గారి సౌజన్యంతో కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని సుజాతనగర్ 21 మరియు 22వ డివిజన్ కార్పొరేటర్లు శ్రీమతి చింతలపూడి శ్రావణి మరియు లింగం పుష్పావతి ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఇందులో భాగంగా సుమారు లక్ష యాభై వేల రూపాయల విలువ చేసే 14 రకాల వస్తువులు తో కూడిన కిట్లు పంపిణీ చేయటం జరిగింది ఇందులో కేజీ బిర్యానీ రైస్, కేజీ వైట్ రైస్, కేజీ నూనె ప్యాకెట్ , కేజీ గోధుమపిండి, కేజీ సేమియా ప్యాకెట్, జీడిపప్పు, కిస్మిస్, కొబ్బరి, నెయ్యి ,మసాలా దినుసులు, పంచదార కేజీ , తదితర వస్తువులతో తయారుచేసిన రంజాన్ తోఫా ను ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగం పిచ్చి రెడ్డి, సీపీఎం నాయకులు చింతలపూడి సాయి కుమార్, టి ఎన్ ఆర్ ట్రస్ట్ సభ్యులు తాండ్ర బుచ్చిబాబు, ఇనుగంటి రాము,నరాటి ప్రసాదు, తాండ్ర నాగబాబు,మురళి మరియు స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్ ని సన్మానించిన తెలంగాణ రేషన్ డీలర్ల అసోసియేషన్



**టేకులపల్లి,మార్చి16,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ అంకిత్ ని సోమవారం తెలంగాణ రేషన్ డీలర్ల అసోసియేషన్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఊకే శేఖర్ రావు, డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో డీలర్లు ఈశ్వరమ్మ, పద్మ, భాగ్యలక్ష్మి, సరోజిని, సరోజ, బి.లక్ష్మణ్, కె. ముత్తయ్య, ఏ. రామన్న, ఎల్.దేవసింగ్, ఏ. రాఘవులు, బి.సందీప్, బి.బాలు తదితర డీలర్లు పాల్గొన్నారు.

## పోదెం వీరయ్య ను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్



**ఇల్లందు, మార్చి 16, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, మాజీ డిసిసి అధ్యక్షుడు పోదెం వీరయ్యను ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ సోమవారం భద్రాచలంలో ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇల్లందు మున్సిపల్ నూతన చైర్ పర్సన్ గా ఎన్నికైన దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ను పోదెం వీరయ్య శాలువాతో సన్మానించారు. ఇల్లందు పట్టణ అభివృద్ధికి పోదెం వీరయ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. ప్రజా సమస్యలు, మున్సిపల్ పరిధిలోని వార్డుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని పోదెం వీరయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో గాలిపల్లి స్వరూప, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి దరఖాస్తుదారునికి గిరిజన సంక్షేమ పథకాలు అందాలి

♦ ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం, మార్చి 16, ప్రజాజ్యోతి:** గిరిజన దర్బార్‌లో అర్జీలు సమర్పించే ప్రతి దరఖాస్తుదారునికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత విభాగాల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ఆదివాసి గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గిరిజన దర్బార్‌లో వచ్చిన అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నామని, అర్హులైన కుటుంబాలకు విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్, ఆర్సీఓ గురుకులం అరుణకుమారి, ఏడీఎం హెచ్వో సైదులు, ఏవో సున్నం రాంబాబు, ఎఫ్‌డీసీ ఉదయ్ కుమార్, డీటీఆర్వో ఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, ఎల్‌టీఆర్ డీటీ నాగేశ్వరరావు, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్వైజర్ అనసూయ, హెచ్ఈఓ లింగా నాయక్, హౌసింగ్ ఏఈ హేమంత్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు కోటి గోటి తలంబ్రాలు సమర్పించిన ఖమ్మం భక్తబృందం



**భద్రాచలం, మార్చి 16, ప్రజాజ్యోతి:** భద్రాచలంలో ఈ నెల 27న జరగనున్న శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మీ బాలాజీ సేవా సమితి భక్తబృందం సోమవారం స్వామివారికి కోటి గోటి తలంబ్రాలను సమర్పించింది. ఖమ్మం నుండి భక్తులు కోలాటం నృత్యాలతో శోభాయాత్రగా బయలుదేరి భద్రాచలం చేరుకున్నారు. అనంతరం "జై శ్రీరామ్... జై జై శ్రీరామ్" నినాదాలతో ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. తరువాత ప్రత్యేకంగా గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను ఆలయ అధికారులకు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు భక్తబృందాన్ని అభినందించారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



**ఇల్లందు, మార్చి 16, ప్రజాజ్యోతి:** ఇల్లందు వాసవి క్లబ్, వనిత క్రౌన్ ఆధ్వర్యంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వృద్ధులు, బాలింతలు, చిన్నారులకు పాలు, పండ్లు, బ్రెడ్ ను అందజేశారు. అదేవిదంగా మెయిన్ రోడ్డు లోని కటకం సెలక్షన్స్ వద్ద వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వి 106 ఏ డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్స్ విఎన్ కేసీజీఫ్ యెలుగూరి మధుబాబు, విఎన్ కేసీజీఫ్ సైఫా రాజశేఖర్ లు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్, వనిత క్రౌన్ అధ్యక్షులు కటకం సత్యేంద్ర కుమార్, కటకం అలేఖ్య లు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరయోధుడు, మహాత్మా గాంధీ ఆశయాలను ఆచరించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని, తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కావాలనే లక్ష్యంతో ఆయన చేసిన నిరాహార దీక్ష భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో సముద్రాల ఉషారాణి, తీర్థాల నాగరాజు, కటకం పెద్ద సత్యనారాయణ, కటకం సుమన్, కటకం చిన్న సత్యనారాయణ, ప్రసాద రావు, కృష్ణార్జున రావు, ప్రభాకర్, శంకర్, గణేష్, రాకేష్ పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి.

### సిపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి. వెంకటేశ్వరరావు



**చర్ల, మార్చ్ 16:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో సోమవారం సిపీ ఐ పార్టీ ఆధ్వర్యంలో చర్ల మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్ సమీపంలోని పెరిగిన గ్యాస్ కొరతను పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని ఇరాన్ పై దాడులను ఆపాలని నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ. సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మెయిన్ రోడ్డు పై రాస్తా రోకో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సి పీ ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నియంతగా వ్యవహరిస్తూ తన ఆధిపత్యాన్ని చలాయించడం కోసం ప్రభుత్వ అధినేతలను సైతం తీసుకుని వెళ్లి నిర్బంధించడం ఇరాన్ పై ఇజ్రాయిల్ తో కలిసి ఏకపక్ష దాడులు నిర్వహించి ప్రపంచ సంక్షోభానికి కారణం అవుతున్న నరేంద్ర మోడీ అమెరికాను ఏమీ అనకుండా చమురు తీసుకోవాలంటే పర్మిషన్ తీసుకోవాల్సి రావటం అమెరికాకు దాసోహమై దేశ సార్వభౌమత్యాన్ని మంట కలిపారని అన్నారు . గ్యాస్ బండల తీవ్ర కొరత గ్యాస్ ధర ఒకేసారి 60 రూపాయలు పెంచడం గ్యాస్ బండలు తీవ్ర కొరత ఏర్పడడంతో హోటల్స్ హాస్టల్స్ మూతపడే పరిస్థితి దాపురించి మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని అన్నారు. దీనికి పూర్తి బాధ్యత నరేంద్ర మోడీ బాధ్యత రహితమైన విధానాలే కారణం అని అన్నారు. ఈ రాస్తారోకో నిరసన కార్యక్రమంలో. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ. మండల కార్యదర్శి నూప పోతయ్య. సహాయ కార్యదర్శి లు. కోటి ముత్యాలరావు. చల్లా లక్ష్మీనారాయణ. కోడి రెక్కల రాజారావు. నరసింహారావు. కూ సం దుర్గాప్రసాద్. నూ ప రాము రమణ. వెంకటేశ్వర్లు. సాయి. కృష్ణ. ప్రవీణ్. రాజు. తిప్పాపురం సర్పంచ్. నుప సునీత. ఉప సర్పంచ్. కల్లూరి సీతారాములు. తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీలకు శ్రీరామనవమి ఆహ్వాన పత్రికల అందజేత



**భద్రాచలం, మార్చి 16, ప్రజాజ్యోతి:** భద్రాచలంలో ఈ నెల 27న నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం, 28న జరిగే శ్రీరామ మహా పట్టాభిషేక మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ దేవస్థానం ఈవో కె. దామోదర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి వసంత్ పాటిల్, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు దంపతులు, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్‌లను మర్యాదపూర్వకంగా కలిసి శ్రీరామనవమి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు. అదేవిధంగా వారికి శాలువా కప్పి, వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఉత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగొద్దు

● ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం, మార్చి 16, ప్రజాజ్యోతి:** శ్రీ సీతారామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విధాలుగా తగిన ఏర్పాట్లు చేయాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ సంబంధిత అధికారులకు సూచించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలకు ఆహ్వానించేందుకు దేవస్థానం ఈవో దామోదర్‌రావు, అర్చక స్వాములు సోమవారం ఐటీడీఏ పీవోను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం, పట్టాభిషేకం వంటి మహత్తర ఆధ్యాత్మిక పర్వదినాలు ప్రజల్లో భక్తి, శ్రద్ధ, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఘనంగా నిర్వహించాలని దేవస్థాన అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఆలయ ఆచారాలు, పూజా విధానాలు, ఉత్సవ కార్యక్రమాలు పురాతన సంప్రదాయాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే ఉత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు, శాంతి భద్రతలు, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భవాని రామకృష్ణ, అమరవాది రామాచార్యులు, ఎస్టీజీ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్థలం కేటాయించాలని కలెక్టర్ కు వినతి



**ఇల్లందు, మార్చి 16, ప్రజాజ్యోతి:** యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భయ్యా వరప్రసాద్, జి యాదగిరి లు మాట్లాడుతూ ఇల్లందు పట్టణంలో సుమారుగా 590 కుటుంబాలు నివాసం ఉంటున్నారని, వీరిలో అత్యధికంగా నిరుపేద, చిరు ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. వారి ఇంట్లో పెళ్లిళ్లు, కర్మలు, ఇతర శుభ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఆర్థిక భారంగా ఉందని, గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న వారు ఎన్నికల సమయంలో రూ. 50 లక్షలు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించడం జరిగిందన్నారు. కానీ వారు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎలాంటి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించలేదని గుర్తు చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం మంజూరైన రూ. 50 లక్షలు గడువు ముగిసే లోపు వినియోగించుకోని యెడల సంభవించి అధికారులు వాటిని తిప్పి పంపే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 2000 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. పెరుగు కోటేశ్వరరావు, నిమ్మల రాములు, ఉడత ఐలయ్య, పుట్ట కృష్ణ, ఉప్పుల శ్రీనివాస్, వెంకటేష్, కంచర్ల రాము తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి ఆఫ్‌లైన్ టికెట్ కేంద్రం ప్రారంభం



**భద్రాచలం, మార్చి 16, ప్రజాజ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా సెక్టార్ టికెట్లు అందజేసే కేంద్రాన్ని దేవస్థానం డీఈ రవీంద్రనాథ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో శ్రీరామనవమి, పట్టాభిషేకం ఉత్సవాలకు సంబంధించిన వివిధ సెక్టార్ల టికెట్లను ఆఫ్‌లైన్‌లో విక్రయిస్తున్నామని తెలిపారు. భద్రాచలం పట్టణ వాసులతో పాటు రామాలయ దర్శనానికి వచ్చే భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. కల్యాణోత్సవం ఉభయదాతల టికెట్లు రూ.7,500 కాగా, ఇతర సెక్టార్లకు సంబంధించిన టికెట్లు రూ.2,500, రూ.2,000, రూ.1,000, రూ.300, రూ.150 ధరలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే పట్టాభిషేకం ఉత్సవానికి సంబంధించి రూ.1,500, రూ.500, రూ.100 టికెట్లను విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం టికెట్లను ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసే అవకాశమున్నందున ముందుగానే టికెట్లు పొందాలని సూచించారు.